చీకటిమయమైన
అడవిదారినే
గమ్యంచేరాలని
అతను
ఎందుకనుకున్నాడు?

# చీకటిమంట

ఉరిటిసులేఖ
కథ

“మా౦మా, వేనిస్క్యాల్కి పోత” కళ్లు నులుపముకుంటూ ఏడుస్తోంది యాదమ్మ బిడ్డ.

“నీ... సెద్దముండ. మనకు సదువు, సందె ఎందుకు? మనం ఏడనన్న పావుశేరు కూలి సేస్కుని బతుకుదాం. సెప్తే యినవ్. మనం సదివితే బట్టకేం ఎల్తాది? పొట్టకేం ఎల్తాది?” కూతురి వీపుమీద గట్టిగ చరిచి లోపలికి ఈడ్చుకుపోయింది యాదమ్మ.

“నీ యవ్వ... మవ్వా పోరిని యింకోసారి కొట్నివనుకో, గొట్టి నిన్ను యింట్లకెల్లి ఎళ్లగొడ్తా, నీ... సంపుత” గట్టిగా అరిచాడు నర్సిమ్మ.

“నువ్వు సాదలేనోడివి. నీకెందుకు పిల్లలు! ఏదో పనిసేస్కుని బతుకుతేంది?” సణుక్కుంటూ వెళిపోయింది యాదమ్మ. నర్సిమ్మ ఏం పని చేస్తాడో ఎవరికీ తెలీదు. ఓసారి బయటికెళ్లాడంటే మూడ్నాల్గు నెలల్దాకా మళ్లీ కన్పించదు! అతడెప్పుడోగానీ మాట్లాడదు. యాదమ్మకి పెళ్లయిన నాటి నుండీ కన్న వారింట్లోనే ఉంటుంది.

“అక్కా, నే పన్లోకి పోతన్నా” చెప్పి బయట పడ్డాడు మల్లేశం. ఆ పిల్లాడికి పద్నాల్గేళ్లుంటాయి. నల్లగ, గడక్రరలా ఉంటాడు. ఆ అబ్బాయి రైల్వే గ్యాంగ్ పన్లో చేరి ఆర్నెల్లవుతోంది. ఆ యింటో వారంతా ఉప్పర పనికి పోతారు.

అక్కడంతా కష్టపడేవారే, నర్సిమ్మ తప్పా! అతన్నెవరూ పనిచెయ్యమని అడగరు. యాదమ్మ ఎప్పుడన్నా అడిగితే ఓ ఆర్నెల్లిపాటు పరారయిపోతాడు. అందుకే అందరికీ భయం.




‘‘ఇంకో వంద రూపాయలు కమాయిస్తే మండుతోన్న కుంపట్లో మాడుతోన్న
యిస్కూల్కి కట్టాల్సిన పైసల్ జమవుత జీడిపిక్కలా ఎండలో నల్లగా మెరుస్తోంది ఆ
య్’’ పట్టాల దగ్గర కంకరని పోగుల్లా పోస్తూ పిల్లాడి దేహం.
తనలో తనే తలపోస్తున్నాడు మల్లేశు. ‘‘ఏందీ ఆలోచన చేస్తున్నవ్?

బువ్వ తిందాం రా'' తీసుకుపోయాడు మరో కూలి.

* * *

కరడు కడ్తోన్న పేదవాడి దుఃఖంలా చీకటి చిక్కబడ్తోంది. ఆక్రోశించి, ఆక్రోశించి గొంతు పూడుకుపోయిన అలగా జనపు ఆక్రందనలా ఆకాశం మౌనం దాల్చింది.

పని నిండి అప్పుడే యింటికి వచ్చాడు మల్లేశు. అంతా విచారంగా ఉన్నారు. యాదమ్మ తలమీద చేతులు పెట్టుకుని తనలో తనే గొణుక్కుంటోంది. ఆ వాతావరణాన్ని బట్టి చెప్పకపోయినా జరిగిందేంటో అర్థమయింది మల్లేశుకి. నర్సిమ్మ యింట్లోంచి పరారయ్యాడు.

''నువ్వు బావని ఎందుకెళ్లగొట్టినవ్? పోయినంక నువ్వేం మానులా సేస్తవే? ఎంతయినా మొగాడు. కిందపడ్డా మొగోడు, మీదపడ్డా మొగోడు. వాడట్ల సేస్తడని నీకెరుకే ఉండే ఎందుకట్ల తిట్టినవ్?

ఓ లం... నీ సావేందో నువ్ సావ్'' విసుగ్గా లోపలికి వెళ్లి ట్రంకుపెట్టె తెరచి డబ్బు లెక్కపెట్టాడు. సరిగ్గా అయిదొందలు. మర్నాడే వెళ్లి అక్క కూతుర్ని స్కూల్లో చేర్పించాలని అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు మల్లేశు.

అంతలో బయట ఎవరో తలుపు బాదుతున్న చప్పుడయింది.

''అరే బాడ్‌కోవ్... ఎవడు బే? యింత రాత్తిరిపూట చప్పుడు చేస్తంది? ఎవడవ్‌రా నువ్వు? దర్వాజా లేసేటోనివి? ఎవరుగావాల! మా పానం తీసేతందుకొచ్చినవ్ రా?
నీ యవ్వ... నీ పెళ్లాన్ని...'' తిట్టుకుంటూ తలుపు తెరిచాడు మల్లేశు.

ఎదురుగా యిద్దరు అపరిచిత వ్యక్తులు.

''అరే నీ అయ్యని పిలువ్ పోరా'' దౌర్జన్యంగా లోపలికి దూరుతూ అన్నాడు ఒకడు.

''మా అయ్యతో నీకేం పనిరా?' గదమాయించాడు.

అరే, నేనెవడనుకుంటున్నవ్! జవానుని. ఎక్కువ తక్కువ మాట్లాడేది కాదు. నీ బావ జాడ దొరికేదాకా నీ అయ్యని పట్కపోతా''.

మల్లేశాన్ని బలంగా ఓ తోపు తోసి అరిచాడు. ఆ గలాటాకి లోపలున్న మల్లేశు తండ్రి బయటకి వచ్చాడు.

'ఏయ్, ముసలోడా, ముత్తడేదున్నాడురా!'

''ముత్తెడెవడయ్యా! మా యింటికి ముత్తెడని వచ్చినవ్?''

''ఈ ఫోటో చూడు ఈడెవడు?''

''పటేలా, వాని పేరు ముత్తెడు కాదు. మా అల్లుని పేరు నర్సిమ్మ. ఈ ఫొటోవ్‌లో ఉన్నాడు మా అల్లుడే, పేరది గాదు''.

''నర్సిమ్మా! ఆడూ ఈడూ ఒకడే! అడవిలో అన్నల్కి ఏందిబే సాయం ఏం జేస్తున్నర్?''

''ఏంది పటేలా? నాకేం తెల్వద్?''

''అరేయ్, నీ అల్లుడెక్కడికి పోయిండు రా?''

''నాకే మెరుక పటేలా? నాకు తెల్వకనే పాయె? ఆడెక్కడికి పోయిండో నాకు తెల్వదాయె''.

"అరే, ఎక్కడ దాచిపెట్టినవో చెప్పు బే?"

"నీ కాల్మొక్త పటేలా, నీ బాంచను ఆడు మా యింట్లో లేడు. ఎక్కడ పోయినదీ నాకు తెల్వద్"

"నిజం పల్కవ్? అబద్దం చెప్తున్నవ్! నీకు నాలుగు తన్నులు గిట్ల కావాల్నా?" అంటూ గట్టిగా అతడి కడుపులో తన్నాడు.

"నీ కాల్మొక్త, నీ బాంచన్, నాకు తెల్వద్ పటేలా? నన్ను కొత్తన్నవ్?" బాధగా అరిచాడు మల్లేశు తండ్రి.

సివిల్ డ్రెస్‌లో పోలీసులు అవేం పట్టించుకోకుండా అతన్ని రెక్కలు పట్టుకుని తీసుకుపోయారు.

"ఓ అవ్వ, అయ్య పోతుండే. అయ్యని పట్కపోతుండ్రే" అరుస్తూ వారి వెనకే పరిగెత్తాడు మల్లేశు.

"ఎవడ్రా తీస్కపోయేటోడు? ముసలాడ్ని పట్క పోతుండ్రయ్యో. జరబోదు రారాదయ్యా" గుండె బాదుకుంటూ ఏడ్వ సాగింది ముసల్ది. అది అరణ్యరోదనే అయింది.


* * *

"ఏందిరా పోరడా, గీడ కూసున్నవ్? ఏం సంగతి?" విచారంగా కూచున్న మల్లేశుని పలకరించాడు మార్కెట్ కృష్ణ. అతడక్కడ దాదా. అతడి మాటకు తిరుగులేదు.

"అన్నా, మా అయ్యను పోలీసోళ్లు పట్కపోయిండ్రు" ఏడుస్తూ చెప్పాడు.

"జర పైసల్ ఖర్చవుతయ్. మీ అయ్యని నేనిడిపిస్త. తమ్మి, నువ్వేం ఫికర్ పడకు" ఆ పిల్లాడి భుజంమ్మీద చెయ్యివేసి ఆప్యాయంగా చెప్పాడు.

పెట్లో భద్రంగా ఫీజుకని దాచిన అయిదొందలు తీసి, తల్లి చెవికమ్మలు గిరివెట్టి ఓ వెయ్యి రూపాయలు



సంపాదించి మార్కెట కృష్ణ చేతిలో పెట్టాడు మల్లేశు.

వారం గడిచింది. హోటల్ దగ్గర తచ్చాడుతున్నాడు మల్లేశు. నెమ్మదిగా ధైర్యం కూడ దీస్కుంటూ.

"అన్నా" పిల్చాడు భయంగానే.

"ఏందిరా తమ్మీ?"

"మా... మా అయ్యని యిడిపించిన్రా!"

"ఒరేయ్ తమ్మీ, మీ అయ్య సచ్చిపోయిండ్రా. పోలీసోళ్లు కుళ్లబొడిసేసి సంపేసిన్రు. ఆత్మహత్య సేస్కున్నడని పుస్తకాల్లో రాసేసిన్రు" మల్లేశుని ఓదారుస్తూ చెప్పాడు.

ఆ మాట వింటంతో కొయ్యలా మారిపోయాడు మల్లేశు. వాడికి మాట పెగల్లేదు. రోడ్డుమీద పెంటకుప్ప పక్కనే కూలిబడిపోయాడు. సరిగ్గా అప్పుడే యిద్దరు వ్యక్తులు అటు రాసాగారు. ఉలిక్కిపడి వార్ని తేరిపార చూసాడు మల్లేశు. సందేహం లేదు. వాళ్లు ఆ పోలీసులే. అర్ధరాత్రి తన తండ్రిని లాక్కుపోయిన ఆ జవాన్లే!

చిత్రహింసలు పెట్టి నిర్దాక్షిణ్యంగా హత మార్చిన ఆ రాక్షసులే! ఏ పాపమూ ఎరుగని తన తండ్రిని అపరాత్రి వేళ రోడ్డుమీద ఈడ్చుకుపోయిన ఆ కిరాతకులే.

నిష్కారణంగా భార్యా బిడ్డల్నుండి వేరుచేసిన ఆ దుర్మార్గులే! యిప్పుడు తనని వెంబడిస్తున్నారు. తనకు తెలీని బావ ఆచూకీ తెల్పమని వేధించి ప్రాణాలు తీసే యమభటులు! యిక తనకు కూడా చావే గతి! అదీ హీనాతిహీనమైన దౌర్భాగ్యపు చావు! జైలు నాల్గు గోడల మధ్య ఒంటరిగా అనాధ చావు. ఆ ఆలోచనకే ఆ పిల్లాడి ఒళ్లు భయంతో గగుర్పొడిచింది. చీకట్లో నెమ్మదిగా పక్కకు జరిగాడు మల్లేశు.

అక్కడ రెండు దార్లున్నాయి. ఒకటి పూర్తి లైట్లతో వెల్గుతోన్న సిటీ. రెండోది చీకటిమయమైన అడవి. ఆ పిల్లాడేం ఆలోచించలేదు. తక్షణం తనక్కడినిండి తప్పించుకోవాలి. అంతే కాళ్లకు బుద్ధి చెప్పాడు.

చిక్కటి చీకటి అడవిలోకి భయంతో పరుగు. రక్షక భటులు (?) బారి నుండి ప్రాణాన్ని రక్షించుకునే నిమిత్తం కటిక చీకట్లోకి ప్రయాణం!

చాలా చాలా దూరంగా అరణ్య గర్భంలో ఎర్రటి మంట కన్పిస్తోంది! రా రమ్మని పిలుస్తోంది! అడవి మంట! చీకటి మంట! అరుణారుణ జ్వాల!

*

